


sahanamvande.com
epaper.sahanamvande.com

# సహనం వందే

హైదరాబాద్ | 07-10-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 165 EDITOR: ROHINI




# విశాఖ గూగుల్‌కు గండం

## ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు




**కోట్ల రూపాయలు పెట్టి డేటా సెంటర్ కడితే... రేపు పొద్దున దాన్ని ఊడబీకమంటే ఏం చేస్తారు? వైజాగ్ సముద్ర తీరంలో గూగుల్, అదానీ కలిసి కట్టబోయే భారీ డేటా సెంటర్ కథ ఇప్పుడు సరిగ్గా ఇలాగే తయారైంది. ఒకవైపు భారీ పెట్టుబడులు, మరోవైపు పర్యావరణ ముప్పు అనే పెద్ద ప్రశ్న!**

**- సహనం వందే, విశాఖపట్నం**

- సొంత రిస్క్ మీదే నిర్మించాలని ఆదేశం
- షరతులతో అనుమతి... సర్కారుకు బిగ్ షాక్
- అసలు వైజాగ్ ల్యాండ్ డ్రామా ఏంటి?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించిన విశాఖ గూగుల్-అదానీ డేటా సెంటర్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఒక షాకింగ్ ట్విస్ట్ జరిగిం ది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం పనులు ముందుకు సాగించవచ్చని కోర్టు చెప్పినప్పటికీ, ఒక షరతు విధించింది. ఈ నిర్మాణం అంతా డెవలపర్ సొంత రిస్క్ మీదే జరగాలని తేల్చి చెప్పింది. అంటే రేపు కోర్టు తీర్పు వ్యతిరేకంగా ఏమైనా వస్తే అయ్యే నష్టానికి కంపెనీయే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే డోలాయమానంలో పడ్డట్లే అని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రాజెక్ట్ ముందంజ వేస్తున్నప్పటికీ చట్టపరమైన చిక్కులు మాత్రం వీడలేదు.

### పర్యావరణ పరిరక్షణపై పిల్ అసలు

ఈ ప్రాజెక్టుపై వివాదం ఎందుకు మొదలైందంటే... పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పిల్ దాఖలైంది. విశాఖపట్నంలో ఈప్రాజెక్ట్ కోసం కేటాయించిన స్థలం పర్యావరణం రీత్యా చాలా సున్నితమైనదని పిటిషనర్లు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ల్యాండ్ యూజ్ నిబంధనలను ఉల్లంఘించారని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రక్షిత ప్రాంతాలకు, సముద్ర తీరానికి అత్యంత సమీపంలో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయని పిటిషన్లో పేర్కొన్నారు. దీనివల్ల స్థానిక పర్యావరణ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### పర్యావరణాన్ని బలిపెడతారా?

హైకోర్టు ఈ కేసును సమీక్షిస్తున్న నేపథ్యంలో నిర్మాణ పనులకు అనుమతినివ్వడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం ముఖ్యమే అయినా మరోవైపు పర్యావరణాన్ని బలిపెట్టడం సరికాదనే వాదన బలంగా వినిపిస్తోంది. నిర్మాణాలు పూర్తి చేసిన తర్వాత పర్యావరణ అనుమతులు లేవని తెలిస్తే ఆ భవనాలను ఏం చేస్తారనేది అతిపెద్ద ప్రశ్నగా మారింది. డెవలపర్లు ఓన్ రిస్క్ మీద పనులు చేసుకోవచ్చని చెప్పడం ద్వారా కోర్టు బంతిని కంపెనీల కోర్టులోనే నెట్టేసింది. ఆ విధంగా పర్యావరణ పరిరక్షణపై కోర్టు ఎంతటి పట్టుదలతో ఉందో అర్థమవుతోంది.

### డేటా సెంటర్లకు అపారమైన విద్యుత్, నీరు

ఈ ప్రాజెక్ట్‌లో గూగుల్ లాంటి అంతర్జాతీయ టెక్ దిగ్గజంతో పాటు అదానీ గ్రూప్ భాగస్వామిగా ఉండటం వల్ల దీనిపై జాతీయ స్థాయిలో దృష్టి పడింది. డేటా సెంటర్లు అనేవి అపారమైన విద్యుత్, నీటిని వినియోగిస్తాయి. ఇది స్థానిక వనరులపై విపరీతమైన ఒత్తిడి తెస్తుంది. అందుకే పర్యావరణంపై ప్రభావం అంచనా అత్యంత పారదర్శకంగా జరగాలని పర్యావరణ వేత్తలు డిమాండ్ చేస్తున్నారు. భూ కేటాయింపుల్లో నిబంధనలు పాటించారా లేదా అనే అంశంపై కూడా సమగ్ర విచారణ జరగాల్సి ఉంది. చట్టబద్ధమైన అనుమతులు లేకుండా వేగంగా పనులు జరిపించడం సముచితం కాదనే భావన వ్యక్తమవుతోంది.

### త్రిశంకు స్వర్గంలో ప్రాజెక్ట్ భవితవ్యం

కోర్టు తీర్పు అంతిమంగా పర్యావరణ హక్కుల వైపు మొగ్గు చూపుతుందా లేక పారిశ్రామిక అభివృద్ధి వైపు నిలుస్తుందా అనేది వేచి చూడాలి. సొంత రిస్క్ మీద పనులు చేపట్టడం అంటే కోట్ల రూపాయల ధనంతో జూదం ఆడటమే అని పలువురు అభిప్రాయపడుతున్నారు. తుది తీర్పు వచ్చే వరకు ఈ ప్రాజెక్ట్ భవితవ్యం త్రిశంకు స్వర్గంలోనే ఉన్నట్లు లెక్క. ఒకవేళ ఈ నిర్మాణాలను కోర్టు అక్రమం అని తేల్చితే గూగుల్, అదానీలకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ కేసు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి ఒక పెద్ద పరీక్షగా మారింది. అభివృద్ధి, పెట్టుబడులు ఎంతో అవసరం. కానీ అదే సమయంలో మన భవిష్యత్తును నిలబెట్టే పర్యావరణాన్ని నాశనం చేసుకుంటూ వెళ్తే, ఆ అభివృద్ధి ఎవరి కోసం? అని మరికొందరు ప్రశ్నిస్తున్నారు.




# అణిచివేస్తే అగ్నిగుండమే

## ఉద్యమాలకు అండగా కాంగ్రెస్ 'సత్యాగ్రహం'

- ప్రజా పోరాటాలకు డిజిటల్ ప్లాట్‌ఫామ్
- అగ్రనేత రాహుల్ గాంధీ వినూత్న ఆలోచన
- ప్రతి చిన్న పోరాటానికి అన్ని విధాలా మద్దతు
- రెండు రోజుల్లో 20 వేల మంది రిజిస్ట్రేషన్




**దేశంలో ప్రతిఒక్కరూ తమ హక్కుల కోసం వీధిపోరాటాలు చేస్తున్న ఈ రోజుల్లో ఏకాకిగా మిగిలిపోతున్న కోట్లాది గొంతులకు తోడుగా ఎవరు నిలబడతారు? విద్యార్థులు, రైతులు, దళితులు, గిరిజనులు, మహిళలు పడుతున్న వేదనను వెలికితీసే నాథుడేడీ? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒక కొత్త సత్యాగ్రహ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న స్థానిక ప్రజా పోరాటాలను ఒకే వేదికపైకి, ఒకే మ్యాప్ మీదికి తీసుకొచ్చి వాటికి ప్రాణం పోయడమే ఈ వినూత్న ఆలోచన వెనుక ఉన్న అసలు ఉద్దేశం.**

**- సహనం వందే, న్యూఢిల్లీ**

మనదేశంలో జెన్ జీ యూత్, విద్యార్థులు, రైతులు, దళితులు, గిరిజనులు, మహిళలు తమ హక్కుల కోసం నిత్యం పోరాడుతున్నారు. కానీ ఆ గొంతులు చాలాసార్లు అధికారుల అణచివేతకు గురై నలిగిపోతున్నాయి. ఒంటరిగా అరిచే ఆక్రోశం మూగబోతోంది. గాంధీజీ నేర్పిన సత్యం అనే ఆయుధానికి ఐక్యత అనే శక్తిని తోడు చేసి ఈ అన్యాయాలను ఎండగట్టాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లోనూ, రోడ్లపైకి వచ్చి పోరాటాల్లోనూ, అధికారులకు ఉత్తరాలు రాస్తూ బాధిత ప్రజల తరఫున తాను నిలబడతానని స్పష్టం చేశారు.

### ఆన్‌లైన్ ఫారమ్‌లో అన్యాయాల కథనాలు...

ఎవరైనా వ్యక్తిగతంగా గానీ, ఒక సమూహంగా గానీ ఈ సత్యాగ్రహ పోర్టల్‌లో తమ ఆవేదనను సమర్పించవచ్చు. సైట్‌లోకి వెళ్లి వాయిస్ పెంచే బటన్ నొక్కి పేరు, రాష్ట్రం, జిల్లా, ఫోన్ నంబర్ నమోదు చేయాలి. భూ హక్కులు, ఆరోగ్య సంరక్షణ, కుల వివక్ష, కార్మిక హక్కులు, పర్యావరణ పరిరక్షణ, మహిళల రక్షణ, రైతుల సమస్యలు, విద్యా సదుపాయాలు వంటి విభాగాలను ఎంచుకుని సమస్యను వివరించవచ్చు. దానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను కూడా జత చేసే వెసులుబాటు కల్పించారు.

### రెండు రోజుల్లో 20 వేల మంది స్పందన

ఈ పోర్టల్ అందుబాటులోకి వచ్చిన రెండు రోజుల్లో 20 వేల మందికి పైగా తమ ఫిర్యాదులు, సమస్యలను సమర్పించారు. విద్యా వ్యవస్థలోని లోపాలు, అవినీతి, సామాజిక అన్యాయాలు, పర్యావరణ సమస్యలపై వేలాది మంది తమ బాధలను పంచుకున్నారు. ప్రతి కథనాన్ని ఒక బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఆ తర్వాత ఆ సమస్యను భారతదేశపు డిజిటల్ మ్యాప్‌లో ఆయా ప్రాంతాల పరిధిలో పిన్ చేసి ప్రదర్శిస్తారు.

### బాధితులకు కొండంత అభయం...

ఈ డిజిటల్ సత్యాగ్రహం ఏదో ఒక రోజుతో ముగిసిపోయే ప్రచారం కాదు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి, చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఉద్యమానికి మద్దతుగా నిలవడానికి ఇది సంవత్సరాల పాటు నిరంతరం కొనసాగుతుంది. ఎక్కడైతే ప్రజా సమస్య తీవ్రంగా ఉందో దానిని పరిష్కరించడానికి సోషల్ మీడియా, పత్రికా సమావేశాలు, చివరకు చట్టసభల వేదికగా గళమెత్తుతామని రాహుల్ గాంధీ ఘంటాపథంగా చెప్పారు.

# రాకెట్ ఎక్కుతున్న విస్కీ బాటిల్

## విలాసవంతమైన కిక్కు కోసం భారీ ప్రయోగం

- ధనవంతుల కోసం లగ్జరీ మద్య పానీయం
- రోదసిలో మ్యాజిక్... నింగిలో ఆల్కహాల్
- ప్రతిరోజు భూమి చుట్టూ తిరగనున్న విస్కీ
- ఐదేళ్ల తర్వాత అద్భుతమైన రుచితో స్కాచ్
- అంతరిక్షంలో శాస్త్రవేత్తల వినూత్న పరిశోధన

**విస్కీ బాటిల్‌ను అంతరిక్షంలోకి పంపితే దాని రుచి ఎలా మారుతుందో ఎప్పుడైనా ఊహించారా? స్కాచ్ విస్కీని ఏకంగా ఆకాశంలోకి పంపి ఐదేళ్ల పాటు తిప్పేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. రోదసిలో కఠినమైన వాతావరణం వల్ల మద్యం ఎంత త్వరగా పక్వానికి వస్తుందో చూడటానికే ఈ ప్రయోగం చేస్తున్నారు. విశ్వాంతరాళంలో జరిగే ఈ చిత్రమైన పరిశోధన ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంచలనంగా మారింది. - సహనం వందే, హైదరాబాద్**

స్కాట్లాండ్, జపాన్ దేశాలకు చెందిన ఇంజనీర్లు స్కాచ్ విస్కీని ఒక రాకెట్‌లో ఎక్కించి రోదసిలోకి పంపేందుకు ప్లాన్ చేశారు. అక్కడ విస్కీ పరిపక్వం చెందే ప్రక్రియ చాలా వేగంగా జరుగుతుందని భావిస్తున్నారు. స్పేస్ ఫుఫిన్ అని పిలిచే ఈ ప్రయోగంలో కొన్ని విస్కీ శాంపిల్లను ఒక చిన్న ఉపగ్రహంలో అమర్చి విశ్వంలోకి పంపుతారు. రోదసిలోని కఠినమైన వాతావరణానికి విస్కీ ఎలా స్పందిస్తుందో క్షుణ్ణంగా విశ్లేషించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం.

### క్యూబ్‌శాట్ ఉపగ్రహంలో ఐదేళ్ల పయనం

ఈ ప్రయోగం కోసం 2028 లాంచ్ డేటుగా ఖరారు చేశారు. స్పేస్ ఎక్స్ సంస్థ ఐఎస్ఎస్ కేంద్రం చేపట్టే రవాణా మిషన్‌లో భాగంగా దీనిని పంపుతారు. ఐఎస్ఎస్ లోని జపాన్ రవాణా మాడ్యూల్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విడుదల చేస్తారు. ఈ శాటిలైట్‌ను క్యూబ్ శాట్ అని పిలుస్తారు. దీనిని స్కాట్లాండ్, జపాన్ విద్యార్థులు కలిసి డిజైన్ చేస్తున్నారు. గ్లాస్గో విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ గిల్లెస్ బైలెట్ నేతృత్వంలో ఈ ప్రయోగాత్మక పనులు వేగంగా జరుగుతున్నాయి.

### మైనస్ 150 నుండి ప్లస్ 200 డిగ్రీలు

ఈ క్యూబ్‌శాట్ ఉపగ్రహం ఐదేళ్ల పాటు భూమి చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. ప్రతి 90 నిమిషాలకు ఒకసారి భూగ్రహం చుట్టూ ఒక రౌండ్ పూర్తి చేస్తుంది. ఆ సమయంలో అంతరిక్షంలో మైనస్ 150 డిగ్రీల తీవ్రమైన చలి నుండి ప్లస్ 200 డిగ్రీల విపరీతమైన వేడి వరకు వాతావరణం సెకన్లలో మారిపోతుంది. ఈ మార్పుల వల్ల విస్కీ మునుపెన్నడూ లేని సరికొత్త ఘాటైన రుచి వస్తుంది.




### తిరిగి రాని ఉపగ్రహం, కెమికల్ టెస్టులు

ఐదేళ్ల కాలంలో శాస్త్రవేత్తలు అంతరిక్షంలో ఉన్న విస్కీ రంగు, దానిలోని రసాయన మార్పులను నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. అయితే ప్రయోగం ముగిశాక ఈ చిన్న క్యూబ్‌శాట్ ఉపగ్రహాన్ని తిరిగి భూమి మీదకు రప్పించరు. భవిష్యత్తులో పెట్టుబడిదారులు ముందుకు వస్తే ఒక పెద్ద విస్కీ పీపాతో పూర్తి స్థాయి మద్యం తయారీ వ్యవస్థనే అంతరిక్షంలోకి పంపాలని డాక్టర్ గిల్లెస్ బైలెట్ యోచిస్తున్నారు.

### కోట్లు కుమ్మరించే మద్యం ప్రియులు

ఈ ప్రయోగం విజయవంతమైతే స్పేస్ ఏజ్డ్ విస్కీ ప్రపంచంలోనే అత్యంత క్రేజీ డ్రింక్‌గా మారుతుంది. విస్కీ తయారీతో పాటు దానిని అంతరిక్షంలోకి పంపే ఖర్చులు తోడై ఈ సీసా ధర చాలా ఎక్కువగా ఉంటుంది. అయినా సరే అరుదైన బాటిళ్ల కోసం కోట్లు ఖర్చు చేసే ధనవంతులకు, మద్యం ప్రియులకు ఈ భారీ ధర అసలు సమస్యే కాదని చెప్పవచ్చు.